## ఈ ఉగాది మరింత గొప్పగా ఉండాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్




గత ఉగాది పండుగ సంవత్సరం యుద్ధాలతో అలజడుల మధ్య సగటు మనిషి జీవితం కల్లోలంగా గడిచిపోయిందని ఈ ఉగాది ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేలా మరింత గొప్పగా ఉండాలని డాక్టర్ చందు అన్నారు. ఆదివారం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ఐత్వారం ముచ్చట్లు ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కవి సమ్మేళనం నిర్వహించారు. ప్రముఖ కవి ఉదారినారాయణ అధ్యక్షుల జరిగిన ఈ సమావేశానికి డా.చందు పాల్గొన్నారు. జిల్లాలో గర్వించదగ్గ కవులు ఉన్నారని ఐత్వారం ముచ్చట్ల ఆధ్వర్యంలో కవి సమ్మేళనం నిర్వహించడం ఆనందంగా ఉందని కార్యక్రమ విశిష్ట అతిథి విశ్వంభర్ అన్నారు. ఈ కార్యక్రమంలో కవి రచయిత రాజవర్ధన్, సామల వీరన్న ఉన్నారు.

## సైబర్ నేరాల గుర్తింపుపై పోలీసుల ప్రచారం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

సైబర్ నేరాలను గుర్తించడానికి బాధితులకు సహాయం చేయడానికి ప్రత్యేకంగా సైబర్ వారియర్స్ పేరట పోలీసులను ఏర్పాటు చేయడంతో పాటు దానికి సంబంధించి ప్రచార పోస్టర్ కూడా పోలీసులు విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సురేష్ కుమార్ జిల్లాలోని 19 స్టేషన్ల పరిధిలో ఒక్కొక్కరి చొప్పున వారియర్స్‌కు సిమ్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రతి పోలీసు స్టేషన్‌లలో సైబర్ వారియర్స్‌ను ఏర్పాటు చేసి వారికి ప్రత్యేక ఫోన్స్, సిమ్స్ అందించడం జరిగిందన్నారు. సైబర్ నేరాలకు గురైన బాధితులు టోల్ ఫ్రీ నెంబర్ 1930కి కాల్ చేసి ఫిర్యాదు, లేదా ఎన్‌సిఆర్‌పి పోర్టల్ ద్వారా గాని ఫిర్యాదు నమోదు చేసుకున్న అనంతరం వారి అప్లికేషన్ స్టేటస్‌ను తెలుసుకోవడానికి తిరిగి 1930 కాల్ చేసిన వెంబడే తమ ఏరియాలో గల సైబర్ వారియర్‌కు సులువుగా ఫోన్ కనెక్ట్ అయి తమ అప్లికేషన్ స్టేటస్ తెలుసుకోవడానికి వీలుంటుందన్నారు. సైబర్ నేరానికి గురైన బాధితులు ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా సమాచారాన్ని ఇవ్వగలిగితే, అంత త్వరగా నేరాన్ని నియంత్రించడానికి వీలవుతుందని తెలిపారు. ఆలస్యం అయితే పరిస్థితి జటిలంగా మారుతుందన్నారు. జిల్లా ప్రజలు ఈ సేవలను వినియోగించుకోవాలని సూచించారు.




# అటకెక్కిన ఆటలు..!

- ఉమ్మడి జిల్లాలో వృథాగా మారిన క్రీడా ప్రాంగణాలు
- అనేక చోట్ల కేవలం బోర్డులకే పరిమితమైన వైనం
- కనిపించని ఆట పరికరాలు.. గ్రామీణులకు క్రీడలు దూరం
- రూ.లక్షల్లో నిధులు దుబారా ..నెరవేరని అసలు లక్ష్యం

పట్టణాల్లో మాదిరిగా..గ్రామీణుల్లోనూ క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించాలనే ఉద్దేశంతో ఏర్పాటుచేసిన క్రీడా ప్రాంగణాలు పనికి రాకుండా పోయాయి. అప్పటి ప్రభుత్వం, అధికారుల ఒత్తిడితో హడావుడిగా నిర్మించిన ఈ ప్రాంగణాలు అసలు లక్ష్యాన్ని విస్మరించాయి. ప్రతి ఊరిలో క్రీడా ప్రాంగణం అనే బోర్డులు కనిపిస్తున్నా..అందులో ఆడుకునేందుకు ఆట పరికరాలు మాత్రం కనిపించడం లేదు. ఉపాధిహామీ నిధులు రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటుచేసిన ఈ ప్రాంగణాలతో గ్రామీణులకు ఎలాంటి ఉపయోగం కలగడం లేదు. మరోపక్క కొన్ని చోట్ల ఈ ఆట స్థలాల ఏర్పాటుకు స్థలం లేకపోవడంతో పాఠశాలలు, గ్రామ పంచాయతీలు, డంపింగ్‌యార్డుల వద్ద బోర్డులు పెట్టి మమ అనిపించారు. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టిన అధికారులు కాగితాల్లో కనిపించగానే ఈ ప్రాంగణాలను బిల్లులు చెల్లించినట్లు ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు వీటిపై దృష్టిసారించి ఉపయోగంలోకి తీసుకొస్తే ప్రయోజనం ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

పట్టణాల్లో మాదిరి గ్రామీణ ప్రాంతాల్లోనూ యువతకు ఆటల పట్ల ఆసక్తి కలిగించాలనే ఉద్దేశంతో అప్పటి ప్రభుత్వం క్రీడాప్రాంగణాలను ఏర్పాటుచేయాలని ఆదేశించింది. ఉపాధిహామీ నిధులు గ్రామ సమీపంలోని కనీసం అర ఎకరం ఖాళీ స్థలంలో వీటిని ఏర్పాటుచేయాలని స్పష్టంచేసింది. ఈ ప్రాంగణం చుట్టూ ఫెన్సింగ్ వేయడంతో పాటు ఖోఖో, వాలీబాల్, బాస్కెట్‌బాల్, షటిల్, కబడ్డీ తదితర క్రీడలు ఆడేందుకు వీలుగా ఆట పరికరాలు అందుబాటులో ఉంచాలని సూచించింది. ప్రతి పంచాయతీలో వీటిని తప్పనిసరిగా ఏర్పాటుచేయాలని చెప్పడంతో అప్పటి అధికారులు వీటిపై ప్రత్యేక దృష్టిసారించారు. ప్రభుత్వం, ఉన్నతాధికారుల ఒత్తిడితో అప్పటి సర్పంచ్‌లు, స్థానిక గుత్తేదారులకు వీటిని ఏర్పాటుచేసే బాధ్యతను అప్పగించింది. ఒక్కో ప్రాంగణం ఏర్పాటుకు రూ.లక్ష నుంచి రూ.2.50లక్షల వరకు వెచ్చించినట్లు తెలిసింది. కానీ అనేక చోట్ల ప్రభుత్వ స్థలాల కొరత కారణంగా మాజీ సర్పంచ్‌లు వీటిని ఏర్పాటుచేసేందుకు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. అప్పటి ప్రభుత్వం, అధికారులు ప్రతి నెలా సమీక్షించడం.. ఏర్పాటుచేయాలని ఒత్తిడి చేయడం మూలంగా బడులు, పంచాయతీ కార్యాలయాలతో పాటు గ్రామంలో ఎక్కడ కొంత ఖాళీ స్థలం కనిపించినా అక్కడ బోర్డులు పెట్టేసి అధికారులకు నివేదించారు. ఈ ప్రాంగణాలకు ఎక్కడా ఫెన్సింగ్ వేసిన దాఖలాలు లేవు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించకుండానే వీటికి బిల్లులు చెల్లించినట్లు ఆరోపణలున్నాయి.

### రూ.లక్షల నిధులు దుబారా..!

గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా పరికరాల కోసం వెచ్చించిన రూ.లక్షల నిధులు దుబారా అయినట్లు కనిపిస్తోంది. ప్రతి పంచాయతీకి ఒకటి చొప్పున కచ్చితంగా ఏర్పాటుచేయాలని సూచించడంతో ఉమ్మడి జిల్లాలో దాదాపు 1509 పంచాయతీల్లో వీటిని ఏర్పాటుచేశారు. ఆదిలాబాద్ జిల్లాలో 468 పంచాయతీలు, నిర్మల్‌లో 396, ఆసిఫాబాద్‌లో 336, మంచిర్యాల జిల్లాలో 310 పంచాయతీల్లో వీటిని ఏర్పాటుచేశారు. ఒక్కో ప్రాంగణం కోసం సుమారు రూ.2.50లక్షల వరకు ఖర్చు చేసినట్లు తెలిసింది. అనేక చోట్ల కేవలం క్రీడా ప్రాంగణం అనే పేరుతో బోర్డుపై రాయించి ఎక్కడో చోట బిగించారు. కొన్ని ఊరికి దూరంగా ఉండటం..మరికొన్ని చోట్ల బడుల బోర్డుల పక్కన వీటిని ఏర్పాటుచేయడం విమర్శలకు తావిస్తోంది. క్షేత్రస్థాయిలో వీటి ఏర్పాటుపై పర్యవేక్షణ చేసి బిల్లులు చెల్లించాల్సి ఉండగా.. అధికారులు మామూలుగా తీసుకుంటూ అవేమీ పట్టించుకోనట్లు తెలిసింది. వారి పర్యవేక్షణ లేని మూలంగా క్రీడా ప్రాంగణాలు ఉపయోగంలో లేకపోగా.. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రూ.లక్షల నిధులు దుబారా చేసినట్లు కనిపిస్తోంది. వీటి ఏర్పాటులో అవినీతి చోటుచేసుకుందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం, ఉన్నతాధికారులు దృష్టిసారించి వీటిని బాగు చేయించాలని గ్రామీణ క్రీడాకారులు కోరుతున్నారు.




ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండలం సుంకిడిలో ఏర్పాటుచేసిన క్రీడా ప్రాంగణం బోర్డు ఇది. డంపింగ్‌యార్డు షెడ్డుకు అతి సమీపంలో క్రీడా ప్రాంగణం అని బోర్డు పెట్టేసి వదిలేశారు. ఎలాంటి ఆట పరికరాలు అందుబాటులో ఉంచలేదు. ఫలితంగా సదరు గ్రామీణ యువతకు ఎలాంటి ఉపయోగం లేకుండా పోయింది. ఇలాంటి ఉపయోగం లేకుండా వృధాగా కనిపిస్తున్న క్రీడా ప్రాంగణాలు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అనేక చోట్ల ఉండటం గమనార్హం.




కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన క్రీడా ప్రాంగణం ఇది. ఊరి బయట బోర్డు ఏర్పాటుచేసి మమ అనిపించారు. ఎలాంటి ఆట పరికరాలు అందుబాటులో ఉంచలేదు. ఫలితంగా ఈ ప్రాంగణం స్థానిక క్రీడాకారులకు ఎలాంటి ఉపయోగం లేకుండా పోయింది. పిచ్చిమొక్కలు వెలిసి వృధాగా ఉండిపోయింది.

## అనుమతులు లేకుండా మొరం తరలిస్తే చర్యలు



నవతెలంగాణ-సారంగాపూర్

అనుమతులు లేకుండా చెరువు నుంచి మొరం తరలిస్తే చర్యలు తప్పవని ఎస్సై చంద్రమోహన్ అన్నారు. మండలంలోని అడెల్లి గ్రామ శివారులోని జలగల కుంట చెరువు నుంచి రాత్రి పూట అక్రమంగా మొరం తవ్వి తరలిస్తున్నా నాలుగు ట్రాక్టర్లను పట్టుకొని పోలీస్ స్టేషన్ తరలించారు. తదుపరి చర్యల నిమిత్తం రెవెన్యూ అధికారులకు అప్పచెప్పినట్టు ఎస్సై వెల్లడించారు.

## జిల్లా పోలీస్ కార్యాలయంలో ఇఫ్తార్ విందు



నవతెలంగాణ-నిర్మల్

జిల్లాలోని ముస్లింలకు వారి కుటుంబ సభ్యులకు పవిత్ర రంజాన్ పండుగ సందర్భంగా ముందస్తుగా హృదయపూర్వక శుభాకాంక్షలను జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల తెలిపారు. ఆదివారం నిర్మల్ పట్టణంలో పనిచేస్తున్న ముస్లిం సోదరులకు రంజాన్ మాస ఉపవాసాల సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ 30 రోజులు నమాజ్, ఉపవాస దీక్షలు పూర్తి చేసుకొంటూ, తమ విధులకు ఎటువంటి ఆటంకం కలుగకుండా పోలీస్ అధికారులు అందరూ సహకరించినందుకు ధన్యవాదాలు తెలిపారు. రంజాన్ ఉపవాస దీక్షలు మార్చి 11 నుంచి ప్రారంభమయ్యాయి. ఒక నెల పాటు ఉపవాసం ఉందని అన్నారు. రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు ఎక్కువ సమయం ప్రార్థనలు చేస్తారన్నారు. ఇస్లాంలో అయిదు సూత్రాలలో ఉపవాసం ఒకటని, కుటుంబం, స్నేహితులతో కలిసి భోజనం చేస్తారని అన్నారు. ఈ ఇఫ్తార్ విందులో పాల్గొన్నందుకు అందరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎఎస్పీ కాంతిలాల్, సీఐలు, ఆర్‌ఐలు, డీపీఓ సూపరింటెండెంట్‌లు, డీపీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**ఉట్నూర్ :** మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట ప్రభాత సమాచారం దినపత్రిక ఎడిటర్, సీనియర్ పాత్రికేయులు సయ్యద్ కరీం ఆధ్వర్యంలో ఆదివారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ ఇఫ్తార్ విందుకు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బోజ్జు పటేల్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్తు మల్లేష్, కాంగ్రెస్ నాయకుడు ఆత్రం భాస్కర్ మండల ప్రముఖులు, పార్టీల నాయకులు పాల్గొని, ప్రత్యేక ప్రార్థనలు చేసి, ఖర్జూరాలు తిని ఉపవాస దీక్షలను విరమించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మైనార్టీల సంక్షేమానికి కాంగ్రెస్ పెద్దపీట వేస్తుందని అన్నారు. రంజాన్ పండుగను ముస్లిం సోదరులు ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరితో కలిసిమెలిసి ఉంటూ, సోదరభవంతో ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

## ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

మద్యానికి బానిసై ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని రాములు గూడలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని రాములుగూడ గ్రామానికి చెందిన మెస్రం గోపాల్(18) ట్రాక్టర్ లేబర్‌గా పని చేస్తుండేవాడు. గత కొంత కాలంగా మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెంది ఎవరు లేని సమయంలో ఇంట్లోని దూలానికి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు హెడ్ కానిస్టేబుల్ మాజిల్ అలీ తెలిపారు.

## కాంగ్రెస్‌లో పలువురి చేరిక

నవతెలంగాణ-నార్నూర్

ఎంపీటీసీ కొలట్కర్ పరమేశ్వర్ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో పలువురు నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ మాట్లాడుతూ కాంగ్రెస్ తెలంగాణ ఇచ్చిన పార్టీ అని, ప్రస్తుతం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని చూసి పార్టీలో చేరానని పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి విజయానికి కృషి చేస్తామని తెలిపారు. ఆయనతో పాటు బీఎస్పీ మండల అధ్యక్షుడు నవీన్ మాహుర్కర్, శంకర్ మస్కే కాంగ్రెస్‌లో చేరారు.

## అక్రమ మద్యం పట్టివేత

నవతెలంగాణ-కుభీర్



మండలంలోని సోనారి గ్రామంలో ఆదివారం అక్రమంగా విక్రయిస్తున్న మద్యాన్ని పట్టుకున్నట్టు ఎస్ఐ రవీందర్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పార్లమెంట్ ఎన్నికల నిబంధనల నేపథ్యంలో ఆదివారం గ్రామాల్లో అక్రమంగా విక్రయిస్తున్న బెల్టు షాపులో తనిఖీలు నిర్వహించారు. సోనారి గ్రామంలో 8.75 లీటర్ల మద్యం సీసాలు లభించడంతో వాటి విలువ సుమారు రూ.4వేల 100 ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఎన్నికల నిబంధనల ప్రకారం మద్యం, డబ్బులు సరఫరా చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు.

**బేల :** అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్ట్ శంకర్‌గూడ వద్ద ఆదివారం వాహన తనిఖీలు నిర్వహించగా మహారాష్ట్ర కొర్పణ నుంచి బేలకు కారులో వస్తున్న వాహనదారుడు రాథోడ్ కేశవ్ వద్ద ఎటువంటి ఆధారాలు, పత్రాలు లేకుండా తీసుకెళుతున్న రూ.72వేల 5వందల నగదు సీజ్ చేసి, ఎఫ్ఎస్‌సీ టీమ్‌కు అప్పగించినట్టు ఎస్సై రాధిక తెలిపారు.

# అప్పుల రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు

నవతెలంగాణ ఆసిఫాబాద్



కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో రూ.7 కోట్ల అప్పులు ఉన్నాయని, సంవత్సరానికి రూ. 70 వేల కోట్ల వడ్డీ కడుతున్న కాంగ్రెస్ ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సితక్క చెప్పారు. ఆదివారం జిల్లా కేంద్రంలో తాటియా గార్డెన్‌లో నిర్వహించిన కాంగ్రెస్ బూత్ స్థాయి ఏజెంట్ల శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రం లోటు బడ్జెట్‌లో ఉన్న ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేస్తున్నామని చెప్పారు. ఎన్నికల కోడ్ రావడం ఇందిరమ్మ ఇళ్ల ముగ్గులు వేయలేక పోయామని అర్హులైన ప్రతి ఒక్కరి ఎన్నికల తర్వాత ఇళ్లు నిర్మించి ఇస్తామని చెప్పారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేస్తుందని తెలిపారు. దేశాన్ని పదేండ్లు పాలించిన బీజేపీ కులాలు, మతాల పంచాయతీ తప్ప ప్రజల సంక్షేమం గురించి ఏనాడు పట్టించుకోలేదని మండిపడ్డారు. కులాలు, మతాల పంచాయతీ పెట్టి ఒకే దేవున్ని మొక్కలని రూల్స్ పెట్టడం ప్రజల విశ్వాసాలను, నమ్మకాలను, విధ్వంసం చేయడం కాదన్నారు. బీజేపీ గవర్నమెంట్ ఆదివాసీ ప్రాంతాల్లోని మన వనరులను ఆదానీ, అంబానీలకు హక్కులు కల్పిస్తూ ప్రశ్నించే వారిని, ఉద్యమకారులను మోడీ అణిచివేస్తున్నారని విమర్శించారు. మంచినీళ్ల కోసం బోర్ వెల్ కూడా వేయనివ్వకుండా వైల్డ్ లైఫ్, రిజర్వ్ ఫారెస్ట్, టైగర్ జోన్ పేరుతో మోడీ ప్రభుత్వం ఇబ్బంది పెడుతుందని మండిపడ్డారు. రాష్ట్రాన్ని పదేండ్లు పాలించిన బీఆర్ఎస్ అన్ని వర్గాలను మోసం చేసిందని, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ నామరూపాలు లేకుండా పోతుందని పేర్కొన్నారు. బీజేపీ ఎప్పుడు గుళ్ల గురించి మాత్రమే చర్చ చేస్తుందని, బడి, వ్యవసాయం, రైతులు గురించి ఏనాడు పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. దేశ భవిష్యత్తును మార్చే బడి, వ్యవసాయ రంగం, రైతులకు మద్దతు ధర ఇవ్వాలన్న సోయి బీజేపీకి లేకుండా పోయిందని ఆరోపించారు. దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన నెహ్రూ కుటుంబంపై పడటం తప్ప బీజేపీ దేశ ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకు ఒక్క ఇల్లు కట్టించి ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పోడు భూములకు హక్కులు కల్పించిందని, ఉపాధి హామీ పథకం ద్వారా పేదలకు పని కల్పించేందుకు ఉపాధి హామీ చట్టం, విద్య హక్కు చట్టం తెచ్చామని, 81 కోట్ల మందికి రేషన్ కార్డులు ఇచ్చి ఆహార భద్రత కల్పించామని చెప్పారు. దేశ ప్రజల కోసం బీజేపీ ఏం చేసిందో చెప్పాలని ప్రశ్నించారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి గెడం నగేశ్ ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రిగా పని చేశారని ఇక సీఎం పదవే తక్కువగా ఉందని, ఇన్ని పదవులు అనుభవించిన నగేశ్ ఏనాడు ప్రజల సమస్యలు పట్టించుకోలేదన్నారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు అసలే ప్రజలకు అందుబాటులో ఉండే వ్యక్తి కాదని ఇలాంటి వాళ్లకు పార్లమెంట్ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈకార్యక్రమంలో జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణా రావు, జిల్లా అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్ రావు, ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ, ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జీలు అజ్మీర శ్యామ్ నాయక్, రావి శ్రీనివాస్, నాయకులు గణేష్ రాథోడ్, అనిల్ గౌడ్, బాలేశ్ గౌడ్, మసాదే చరణ్, వసంత్ రావు, మంగ, కృష్ణ కూమరి, కళావతి పాల్గొన్నారు.

**రైతులకు కోసం బీఆర్ఎస్, బీజేపీ నిరసన హాస్యాస్పదం**

రైతులకు కోసం అంటూ మొసలి కన్నీరు కారుస్తూ బీఆర్ఎస్, బీజేపీలు చేస్తున్న నిరసన దీక్షలు హాస్యాస్పదమని రాష్ట్ర పంచాయతీ రాజ్ స్త్రీ శిశ, సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఎద్దేవా చేశారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ పదేండ్లలో తెలంగాణను విధ్వంసం చేశారని బీఆర్ఎస్‌పై నిప్పులు చెరిగారు. రాష్ట్రంలో కేసీఆర్ పాలనలో రైతులు పండించిన పంటలో క్వింటాల్‌కు 10 నుండి 15 కిలోల కోతలు రైతులు మర్చిపోలేదన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో నేపథ్యంలో బీజేపీతో కలిసి రైతుల పక్షాన పోరాడుతున్నట్లు నటిస్తున్నారని ఆరోపించారు. సోనియాగాంధీ కుటుంబానికి రాష్ట్రంపై ఎంతో ప్రేమ ఉందని ఇప్పటికే రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని పార్లమెంటు స్థానాలు కూడా అదే విధంగా సాధిస్తామని కొత్తగా ఇక్కడ హామీలు ఇవ్వాల్సిన అవసరం లేకుండా అభివృద్ధి కోసం పరితపిస్తున్నామన్నారు. రాష్ట్రంలో తాము కేవలం ప్రజాసేవకులమేనన్నారు. పదేండ్లలో రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టులు విధ్వంసానికి గురయ్యాయని దీనికి నిదర్శనమే కుమురం భీం, వట్టివాగు, కడెం ప్రాజెక్టు, కాళేశ్వరం ప్రాజెక్టులు అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఈ ప్రాజెక్టులు సరిచేసి ఉంటే రెండు పంటలకు నీళ్లు అందించే అవకాశం ఉండేదని అప్పుడు ఈ ప్రాంతంలో పేదరికం లేకుండా చేసే వీలుండేదన్నారు. బీజేపీ దేశంలో కుల మతాలను అడ్డుపెట్టుకొని అధికారంలోకి రావాలని ప్రయత్నాలు చేస్తుందని, రాజ్యాంగం ప్రకారం తాము పరిపాలన కొనసాగిస్తామన్నారు. ప్రజలు గొప్పవారని తమ పాలకులను వారే నిర్ణయించుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వ ప్రసాద్, నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యామ్ నాయక్, మాజీ ఎంపీపీ బాలేష్ గౌడ్, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన ఆదర్శ పాఠశాల ప్రవేశపరీక్ష

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో తెలంగాణ ఆదర్శ పాఠశాలలో 6 నుండి 10వ తరగతి వరకు ప్రవేశం కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్లు అధికారులు తెలిపారు. పరీక్ష కేంద్రాలను డీఈఓ అశోక్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఆరో తరగతి ప్రవేశ పరీక్షకు ఐదు పరీక్షా కేంద్రాల్లో 733 విద్యార్థులకు గాను 692 విద్యార్థులు హాజరైనట్లు, మధ్యాహ్నం 7 నుండి 10వ తరగతి ప్రవేశ ప్రవేశం కోసం జిల్లాలో 4 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ పరీక్షా కేంద్రాల్లో ఏడవ తరగతి 348 విద్యార్థులకు 309 మంది, ఎనిమిదో తరగతిలో 248 విద్యార్థులకు 208 విద్యార్థులు, 9వ తరగతిలో ప్రవేశానికి 162 విద్యార్థులకు 151 విద్యార్థులు, పదవ తరగతిలో ప్రవేశానికి 35 మంది విద్యార్థులకు 28 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. మొత్తం 1527 మందికి గాను 1347 మంది హాజరుకాగా 120 మంది గైర్హాజరైనట్లు తెలిపారు.

## బొగ్గు ఉత్పత్తి సాధించిన కార్మికులకు సొంత ఇల్లు అమలుచేయాలి

నవతెలంగాణ-రెబ్బెన

బొగ్గు ఉత్పత్తి సాధించిన కార్మికులకు సొంత ఇల్లు అమలుచేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్ అన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం హైదరాబాద్‌లోని సత్యనారాయణరెడ్డి భవనంలో జరిగిన సమావేశంలో జిల్లా నుంచి ఆయన పాల్గొని మాట్లాడుతూ ప్రతి సంవత్సరం బొగ్గు ఉత్పత్తిలో ముందుకుపోతున్న సింగరేణి యాజమాన్యం ఈ సంవత్సరం 70. 02 మిలియన్ టన్నుల సాధనకు కృషి చేసిన కార్మికులకు, అధికారులకు, కాంట్రాక్టు కార్మికులందరికి అభినందనలు తెలియజేసినట్టు ఆయన తెలిపారు. గతంలో ఉత్పత్తి మాసాల్లో ప్రత్యేక ప్రోత్సాహక బహుమతులను ప్రకటించే యాజమాన్యం కోవిడ్ సమయం నుండి ప్రోత్సాహక బహుమతులను మర్చిపోయిందన్నారు. సింగరేణిలో లాభాలను వెంటనే ప్రకటించి 40 శాతం వాటాను కార్మికులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. యూనియన్ ఎన్నికల్లో గెలుపొందిన యూనియన్‌లకు ఇంతవరకు గుర్తింపు పత్రాన్ని ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారని మండిపడ్డారు. వెంటనే గుర్తింపు పత్రాన్ని ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

## హత్యాయత్నం కేసులో ఇద్దరికి రిమాండ్

నవతెలంగాణ-కౌటాల

మార్చి 27న మండలంలోని బాలేపల్లి గ్రామానికి చెందిన కోబ్రాగడే దీప్‌చంద్ అనే వ్యక్తిపై అదే గ్రామానికి చెందిన జాడి బాలు, జాడి ప్రియాంక గొడ్డలితో దీప్‌చంద్ మెడపై దాడిచేసి గాయపరిచారు. గతంలో ప్రియాంక, దీప్‌చంద్‌కు అక్రమ సంబంధం ఉందని పలుమార్లు గ్రామ పెద్దల సమక్షంలో పంచాయతీలు కూడా జరిగాయి. ఇది దృష్టిలో పెట్టుకొని తమ వైవాహిక జీవితానికి దీప్‌చంద్ అడ్డుగా వస్తున్నాడని గ్రహించి మార్చ్ 27న రాత్రి రెండు గంటల సమయంలో తన పంట చేను నుండి ఇంటికి వస్తున్న దీప్‌చంద్‌పై జాడి బాలు, ప్రియాంక గొడ్డలితో నాలుగుసార్లు దాడిచేసి గాయపరిచారు. బాధితుడి చెల్లెలు జాడి కల్పన ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇరువురిపై హత్యాయత్నం కేసు నమోదుచేసి ఆదివారం రిమాండుకు తరలించినట్టు ఎస్సై ఎన్ మధూకర్ తెలిపారు.

## మతాలకు అతీతంగా కలిసిమెలసి ఉండాలి

నవతెలంగాణ-సిర్పూర్(టి)

మతాలకు అతీతంగా కలిసిమెలసి ఉండాలని రమాబాయి సొసైటీ అధ్యక్షురాలు లలిత అన్నారు. ఆదివారం రంజాన్ పవిత్ర మాసాన్ని పురస్కరించుకోని ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ముస్లిం సోదరిమణులతో కలిసి ప్రార్థనాలు చేసి ఉపవాస దీక్షలను విరామింపజేశారు. ఈ కార్యక్రమంలో చునార్దర్ కమల, వరలక్ష్మి తాంద్ర, అర్క కవిత, నిండు గురి శ్యామ్ రావు, కాశి పాక రాజు, సల్మాన, సోఫి పాల్గొన్నారు.

## దాబా హోటళ్లు, దాబాల్లో పోలీసుల తనిఖీ

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని హోటళ్లు, దాబాల్లో ఆదివారం పోలీసులు తనిఖీలు నిర్వహించినట్టు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. నిర్మల్, ఆదిలాబాద్ పాత 7వ నెంబరు జాతీయరహదారి పక్కనే ఉన్న దాబా హోటళ్లలో తనిఖీ చేపట్టగా ఈ తనిఖీల్లో తీన్మార్ దాబాలో అక్రమంగా మద్యం 9, బీర్ సీసాలు లభ్యమయ్యాని తెలిపారు.దాబాల్లో మద్యం అమ్మకాలు, సిట్టింగ్ నిర్వహించరాదని యజమానులకు ఆదేశాలు ఇచ్చారు. తీన్మార్ దాబాలో మద్యం అమ్ముతున్న నిర్వాహకునిపై కేసులు నమోదు చేశామన్నారు.

**మద్యం తాగి వాహనాలు నడుపొద్దు**

మద్యం తాగి వాహనాలు నడుపొద్దని ఎస్సై చంద్రమోహన్ అన్నారు. ఆదివారం మండలకేంద్రంలోని అడెల్లి కమాన్ వద్ద పోలీసులు సాయంత్రం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారికి బ్రీత్ ఎనలైజర్ టెస్టు చేసి మద్యం తాగినట్టు నిర్ధారణ అనంతరం నలుగురు వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు.

2

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

ఆదిలాబాద్-నిర్మల్

సోమవారం | ఏప్రిల్ 08, 2024 | www.navatelangana.com

## నిత్యావసర సరుకులు పంపిణీ

నవతెలంగాణ-ఉట్నూర్



సాటి మనిషిని బాధించడం ఇస్లాం మత ఉద్యేశం కాదని, సామాజిక కార్యకర్త ఆజ్మీరా జయచంద్రు నాయక్ అన్నారు. ఆదివారం మండలంలోని లక్కారం గ్రామపంచాయతీలో ముస్లింలకు తన వంతుగా నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం సోదరులు ఉన్నారు.

## తాగునీటి సమస్య లేకుండా ప్రత్యేక చర్యలు

నవతెలంగాణ-నార్నూర్



ఎండాకాలం నేపథ్యంలో తాగునీటి సమస్య లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని డిప్యూటీ కలెక్టర్ గంగాధర్ పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని విజయ్‌నగర్ కాలనీలో తాగునీటి సమస్య ఉండటంతో పొలంలో ఉన్న బావిని పరిశీలించారు. భూగర్భ జలాలు అడుగంటిపోయి బావిలో నీరు లేకపోవడంతో వేరేచోట బావి నుంచి తాగునీటికి శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. వారి వెంట ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ శుభాని, ఎంపీఓ ఆనంద్, కార్యదర్శి జాదవ్ అనురాగ్ ఉన్నారు.

# మరమ్మతులకు నోచుకోని వెంకటాద్రి చెరువు

- నాలుగేండ్లుగా వృథా అవుతున్న నీరు
- పగుళ్లు తేలిన తూము, పూర్తిగా కిందకు దిగని గేటు
- పట్టించుకోని సంబంధిత శాఖ అధికారులు

**ఆయకట్టు రైతులకు వరప్రదాయనిగా ఉండాల్సిన చెరువులు మరమ్మతులకు నోచుకోవడం లేదు. ఫలితంగా నీరు వృథా కావడంతో పాటు ఆయకట్టు రైతులకు నీరందక, రబీ పంటలు పండించలేని పరిస్థితులు నెలకొన్నాయి. అధికారుల అలసత్వం కారణంగా, చిన్నపాటి మరమ్మతులను అధికారులు చేపట్టక చెరువులు నిరుపయోగంగా మారుతున్నాయి.**





నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని దేవాపూర్ సమీపంలోని వెంకటాద్రి చెరువు తూము గత నాలుగేండ్లుగా మరమ్మత్తులకు నోచుకోవడం లేదు. తూము పగుళ్లు తేలాయి. తూము గేటు పూర్తిగా కిందకు దిగకపోవడంతో లీకేజీలు ఏర్పడి చెరువులోని నీళ్లు మొత్తం వృథాగా కిందకు వెళుతున్నాయి. దీంతో రైతులకు ఆరు తడికి నీరందడం లేదు. ఫలితంగా రైతులు పంటలు పండించ లేక పోతున్నారు. ఈ విషయమై గ్రామస్తులు పలు మార్లు అధికారులకు విన్నవించిన పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హాయంలో చెరువు ట్యాంక్‌ను మిషన్ కాకతీయ పనులు సైతం తూతూ మంత్రంగా నిర్వహించారు. చెరువు పూడికను పూర్తి స్థాయిలో తీస్తే నీటి సామర్థ్యం పెరిగేదని, పూడికను పూర్తి స్థాయిలో తీయకపోవడంతో అక్కడి ప్రజలకు గాని రైతులకు గాని ఎలాంటి ప్రయోజనం చేకూరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షంతో నిండిన నీటిని కూడ ఒడిసి పట్టుకోలేని పరిస్థితి ఉందని తెలిపారు.

**నాలుగేండ్లుగా నీరు వృథా...**

దేవాపూర్ వెంకటాద్రి చెరువు మరమ్మత్తులను అధికారులు చేపట్టకపోవడంతో గత నాలుగేండ్లుగా నీరు వృథా అవుతోంది. వర్షాకాలం వర్షాలు సంవృద్ధిగా కురిసి చెరువు నిండినప్పటికీ, తూము షట్టర్ పూర్తిగా మూసుకు పోవడం లేదు. దీంతో షట్టర్ కింది నుంచి నీరు వృథాగా పోతున్నాయి. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదని రైతు తమ బాధలను వెలిబుచ్చారు. గత నాలుగేండ్లుగా ఆయకట్టు రైతులు పంటలు పూర్తి పండించడం లేదని, వర్షాధార పంటలు మాత్రమే పండిస్తున్నామని పేర్కొంటున్నారు. రబీ పంటలు పండించడం లేదని దీనితో తాము ఆర్థికంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వేసవి కాలం నేపథ్యంలో ఉష్ణోగ్రతలు జిల్లాలో రోజు రోజుకు పెరుగుతున్నాయి. చెరువు పరిస్థితి ఇలా ఉండగా కనీసం పశువులు తాగేందుకు నీరు దొరికే పరిస్థితులు కనబడటం లేదని పశుపోషకులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువును సందర్శించి, వర్షాకాలం కంటే ముందే మరమ్మత్తులు చేపట్టాలని, రబీ పంటలకు నీరందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

### తూము మరమ్మతులు చేపట్టాలి

దామోదర్‌రెడ్డి, రైతు



నీటి పారుదల శాఖ అధికారులు స్పందించి వెంకటాద్రి చెరువు తూము మరమ్మతులు చేపట్టాలి. తూము భాగం మొత్తం పగుళ్లు తెలింది. అధికారుల బృందం చెరువును సందర్శించి, నిధులు కేటాయించి మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలి. చెరువు భాగం పూర్తిగా దెబ్బతినక ముందు చర్యలు చేపట్టారు. ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు.

## నంది అవార్డు గ్రహీతకు సన్మానం



నవతెలంగాణ-లక్ష్మణచాంద

నిర్మల్ ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి డా.వేణుగోపాలకృష్ణ ఉత్తమ దర్శకునిగా ఇటీవల నంది పురస్కారం అందుకున్నారు. ప్రేమతో నాన్న ఉత్తమ లఘు చిత్రంగా, సుహాసిని ఉత్తమ నటిగా అవార్డులు అందుకున్నారు. హైదరాబాద్ బిర్లా ఆడిటోరియంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో నంది పురస్కారాలు ప్రదానం చేశారు. ఆదివారం ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తండ్రికూతురును శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వేణుగోపాలకృష్ణ, సుహాసిని ఆయా రంగాల్లో అందించిన వైద్యసేవలను కొనియాడారు.

## మద్యం మత్తులో ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-సారంగాపూర్



మద్యం మత్తులో ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని బీరవెల్లిలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై చంద్రమోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బీరవెల్లి గ్రామానికి చెందిన షేక్ ఇసా(45) కొంత కాలంగా మద్యం తాగుడుకు అలవాటు పడ్డాడు. మద్యం మత్తులో ఇంటిలో ఎవరూ లేని సమయంలో దూలానికి నైలాన్ తాడుతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని బార్య సభినా బేగం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు. మృతునికి బార్య ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు.

## తండాల్లో సేవాలాల్ దీక్షల సందడి



నవతెలంగాణ-ఉట్నూర్

యువత భక్తి మార్గంలో నడవాలని సేవాలాల్ దీక్షదారి బాలు నాయక్ అన్నారు. ఆదివారం ఉదయం 11 రోజుల శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ దీక్షలు స్వీకరించారు. నానాటికి పెరుగుతున్న భక్తి భావం, లంబాడా ప్రజలకు 1979లో దీక్ష గురు ప్రేమ్‌సింగ్ మహారాజ్ ఆధ్వర్యంలో 1600 మందితో నార్నూర్ మండలంలోని కొత్తపల్లి గ్రామంలో దీక్షలను ప్రారంభించారు. ప్రతి సంవత్సరం మహా శివరాత్రి నుంచి ప్రారంభమై శ్రీరామనవమి వరకు ఈ దీక్షలు కొనసాగుతాయని, 41 రోజులు కాళ్లకు చెప్పులు లేక, ఉపవాసం ఉంటూ, సాయంత్రం ఒక్క పూట భోజనం చేసి భక్తి భావంతో కఠోరంగా ఉంటారని బానోత్ రవీందర్ అన్నారు. శ్రీరామ నవమికి దీక్ష విరమణ చేస్తారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ దీక్షదారులు సురేష్, విజయ్, బాలు, వసంత్ రావు ఉన్నారు.

## ఆటో బోల్తా పడి ఒకరు మృతి, పలువురికి గాయాలు

నవతెలంగాణ-జైనథ్



ఆటో బోల్తా పడి ఒకరు మృతి చెందిన విషాద సంఘటన శనివారం రాత్రి మండలంలోని తరోడ బ్రిడ్జి వద్ద చోటు చేసుకుంది. విషయాన్ని తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని, బాధితులని రిమ్స్‌కు తరలించారు. సంఘటన స్థలాన్ని పరిశీలించి, సీఐ డి.సాయినాథ్ తెలిపిన వివరాల ప్రకారం... శనివారం రాత్రి సుమారు 09:30 గంటల ప్రాంతంలో మండలంలోని తర్నం బ్రిడ్జి వద్ద ఆటో నెం టీఎస్ 01యూసీ 2036 జక్కులవార్ రాకేష్ తన ఆటోలో ప్రయాణికులను ఆదిలాబాద్‌లో ఎక్కించుకొని జైనథ్ వస్తుండగా, మద్యం తాగి, నిర్లక్ష్యంగా, ఆటో నడపడమే కాకుండా నిషేదిత మార్గమైనా తరోడ బ్రిడ్జిపై నుంచి ఆటోను తీసుకువచ్చే ప్రయత్నంలో ఆటో బోల్తా పడి ఆటోలో ప్రయాణిస్తున్న ఇప్పా భరత్ కుమార్‌కు తీవ్ర గాయాలై మరణించాడు. తోటి ప్రయాణికులైన పుష్ప, పద్మ అనే ప్రయాణికులకు గాయాలు అయి రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. ఆటో డ్రైవర్ మద్యం తాగి, నిర్లక్ష్యంగా ఆటో నడపటంతో ఈ ప్రమాదం జరిగిందని సీఐ డి.సాయినాథ్ తెలిపారు. చనిపోయిన వ్యక్తి సోదరుడు ఇప్ప సుభాష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేసి, ఆటో సీజ్ చేయడం జరిగిందని అన్నారు. మద్యం తాగి వాహనాలు నడపరాదు. మద్యం తాగి నిర్లక్ష్యంగా వాహనాలు నడిపి ప్రమాదానికి కారకులైన వ్యక్తులపై కఠినంగా వ్యవహరిస్తామని, ఈ సంఘటనలో ఆటో డ్రైవర్ మద్యం తాగి, ప్రమాదానికి కారకుడైనందున అతనిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలిస్తున్నట్టు సీఐ తెలిపారు.

## నేడు కాంగ్రెస్ బూత్ లెవెల్ సమావేశం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కాంగ్రెస్ బూత్ లెవెల్ ఏజెంట్స్ కోఆర్డినేటర్ల సమావేశాన్ని ఈనెల 8న జిల్లా కేంద్రంలోని రత్న గార్డెన్‌లో నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌ఛార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా పార్లమెంట్ ఇన్‌ఛార్జి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీతక్క, ఏఐసీసీ నేషనల్ కోఆర్డినేటర్ కొప్పుల రాజు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని, సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## కాంగ్రెస్ పార్లమెంట్ పరిశీలకులుగా మతిన్

నవతెలంగాణ-నిర్మల్



పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి పార్లమెంట్ నియోజకవర్గంలో నిర్మల్ అసెంబ్లీ పరిశీలకులుగా జిల్లా కేంద్రానికి చెందిన ఎంఏ మతిన్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం ఎఐసీసీ మైనార్టీ విభాగం వైస్ చైర్మెన్, తెలంగాణ ఇన్‌చార్జి ఫర్హాన్ అజ్మీ నియామకాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా మతిన్ మాట్లాడుతూ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సుగుణ విజయం కోసం నిర్మల్ నియోజకవర్గంలో బూత్ స్థాయి నుంచి కార్యకర్తలను సమన్వయం చేస్తూ ముందుకు వెళ్తామని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక సీట్లు కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని, దేశంలో రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అవ్వడం ఖాయమని పేర్కొన్నారు.

## రాముడు గుడిసె నుంచి గుడిలోకి వెళ్లాడు

- ఆదిలాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేష్



నవతెలంగాణ-తలమడుగు

రాముడు గుడిసె నుంచి గుడిలోకి వెళ్లాడని ఆదిలాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేష్ అన్నారు. ఆదివారం బీజేపీ మండల స్థాయి కార్యవర్గ సమావేశాన్ని మండలంలోని ఝరి గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేష్ మాట్లాడుతూ రాముడు ఎన్నో కష్టాలు పడ్డ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రామున్ని గుడిసె నుంచి గుడిలోకి పంపించిన ఘనత నరేంద్ర మోడీ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన అనేక సంక్షేమ పథకాలు కేంద్ర ప్రభుత్వ నిధులతో ముడిపడి ఉన్నవేనని అన్నారు. సంస్కృతికి సాంప్రదాయాలకు నిలయమైన దేశం భారతదేశమని అలాంటి సంస్కృతి సాంప్రదాయాలకు బీజేపీ ప్రభుత్వం పెద్దపీట వేసిందని తెలిపారు. రాముడి అక్షింతలతో మనందరి జీవితాలు సార్థకత అయినవని, రాముడి గుడి కట్టి అందరికి అక్షింతలు పంపిన యుగ పురుషుడు నరేంద్రమోడీకి ఓటు వేసి కృతజ్ఞత తెలపాలని పిలుపునిచ్చారు. అందరు కలిసికట్టుగా పని చేసి గెలిపించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు పతంగే బ్రహ్మనంద్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి, రైల్వే బోర్డు సభ్యులు జీవీ రమణ, పార్లమెంట్ కోకన్వీనర్ మయూర్ చంద్ర, తాంసి జెడ్పీటీసీ రాజు, బీజేపీ మండల అధ్యక్షులు, మండల బీజేపీ నాయకులు స్వామి, శ్రీనివాస్, రవీందర్, కనపర్తి చంద్రకాంత్, జక్కుల ప్రభాకర్, వెంకటస్వామి, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మిత్రునికి రూ.25వేలు ఆర్థిక సాయం



నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

క్యాన్సర్ వ్యాధితో నాలుగు రోజుల కింద భార్యను కోల్పోయి బాధపడుతున్న స్థానిక విద్యానగర్‌కు చెందిన వడ్ల రాముకు ఆయన చిన్న నాటి మిత్రులు ఆదివారం రూ.25వేలు ఆర్థిక సాయం అందజేశారు. 1990-91 ఎస్ఎస్‌సీ బ్యాచ్‌కు చెందిన మిత్రులు డా. కృష్ణంరాజు, హోండా గణేష్, అవ్వ బుచ్చన్న, గుగ్గిళ్ల రాజేందర్‌గౌడ్ వెంకటప్పయ్య, మంత్రరాజం శ్యాం, శైలేందర్‌రెడ్డి కలిసి వడ్ల రాముకు నగదు అందజేశారు.

## అడెల్లి పోచమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే



నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలో ప్రద్ధిగాంచిన అడెల్లి శ్రీమహా పోచమ్మను ఆదివారం ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రధాన అర్చకులు శ్రీనివాస్ శర్మ ప్రత్యేకపూజలు నిర్వహించి, తీర్ధ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ సీనియర్ అసిస్టెంట్ రమణారావు శాలువాతో సత్కరించారు. వీరి వెంట రాష్ట్ర బీజేపీ నాయకులు రావుల రామ్‌నాథ్, బీజేపీ మండల కన్వీనర్ విలాస్, శేఖర్‌గౌడ్, వెంకటేష్, బీజేపీ నాయకులు ఉన్నారు.

# ఎత్తిపోతల పథకాలపై రైతులకు అవగాహన

- ముధోల్‌ను సస్యశ్యామలం చేయడమే నా ధ్యేయం
- ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్

నవతెలంగాణ-భైంసా



ముధోల్ నియోజకవర్గం రైతాంగం సాగునీటిపై మరింత అవగాహన ఉండాలన్న ఉద్దేశంతో ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ నేతృత్వంలో నందిపేట మండలం వన్నెల్(కె) గ్రామానికి తరలి వెళ్లారు. అక్కడి గ్రామ రైతులు ఎత్తిపోతల పథకం వినియోగించుకుంటున్న తీరును ఎమ్మెల్యే రైతులకు వివరించారు. ప్రతి సంవత్సరం రెండు పంటలు తీస్తూ అక్కడ రైతులు ఆదర్శంగా నిలవడంతో మన ప్రాంతానికి చెందిన బ్రహ్మన్‌గావ్, ఆష్ట, గన్నోరా, కనకాపూర్, అబ్దుల్లాపూర్, వడ్తల్, జోర్‌పూర్, గోడిసేరా, చింతకుంట, లోకేశ్వరం, పిప్రి, ధర్మోరాకు చెందిన దాదాపు 150 మంది రైతులు వాహనాల్లో వెళ్లారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి మాట్లాడారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వన్నెల్(కె) గ్రామ రైతులను ఆదర్శంగా తీసుకొని మన ప్రాంత రైతాంగం ముందుకు సాగాలని సూచించారు. అక్కడి రైతులు సంఘంగా ఏర్పడి ఎత్తిపోతల పథకాలకు సంబంధించిన చిన్నచిన్న రిపేర్లు వారే చేయించుకుంటు సాగునీటిని వాడుకుని అధిక దిగుబడులు సాధించడం మంచి పరిణామం అన్నారు. నియోజకవర్గంలో గోదావరి నది పరివాహక ప్రాంత గ్రామాల్లో ఎత్తిపోతల పథకాలను మరింత అభివృద్ధి పరచడమే తన ధ్యేయమన్నారు. నియోజకవర్గంలో రైతాంగానికి సాగునీరు అందించేందుకు పాటుపడతానని అందులో భాగంగానే అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అనంతరం ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ రైతులందరూ ఒక్కటై ఐక్యంగా పనులు చేసుకుంటేనే వ్యవసాయ రంగంలో పురోగతి సాధించవచ్చు అన్నారు. రాజకీయాలకతీతంగా రైతులంతా ఒక్కటి కావాలన్నారు. రైతు కమిటీలు ఏర్పాటు చేసి అందరి అభిప్రాయం మేరకు ముందుకు సాగితే వ్యవసాయంలో మరింత సక్సెస్ కావచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట బీజేపీ నాయకులు సాంవలి రమేష్, వెంగల్‌రావు, లిఫ్ట్ ఇరిగేషన్ చైర్మెన్ రాజారెడ్డి, రైతులు, నీటి సంఘం సభ్యులు ఉన్నారు.

## కొలుకున్న దళిత హక్కుల జిల్లా నాయకుడు జాదవ్ శేఖర్

నవతెలంగాణ-నార్నూర్

దళిత హక్కుల జిల్లా నాయకుడు జాదవ్ శేఖర్ అనారోగ్యం బారిన పడి సర్జరీ పూర్తి చేసుకొని కొలుకున్నారు. ఆదివారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. సర్జరీ విజయవంతంగా పూర్తి చేసిన డాక్టర్‌కు ప్రత్యేక ధన్యావాదాలు తెలిపారు. వారి వెంట కుటుంబ సభ్యులు ఉన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
సోమవారం | ఏప్రిల్ 08, 2024 | www.navatelangana.com

## వాంకిడి టోల్‌ప్లాజా వద్ద రూ.60 వేలు పట్టివేత

నవతెలంగాణ-వాంకిడి



మండలంలోని టోల్‌ప్రాజా చెక్‌పోస్టు వద్ద ఆదివారం సాయంత్రం వాహనాల తనిఖీ చేశారు. సరైన ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.60 వేల నగదును పట్టుకున్నట్టు ఎస్‌ఐ సాగర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఆసిఫాబాద్ మండలం జెండాగూడ గ్రామానికి చెందిన జాడె అశోక్ కారులో ఆసిఫాబాద్ వైపు నుండి వాంకిడికి వస్తుండగా అతని వద్ద నుండి రూ.60 వేలు పట్టుకున్నామన్నారు. సరైన ఆధారాలు లేని కారణంగా మొత్తం నగదును సీజ్ చేసి ఎస్-ఎస్‌టీ టీంకు అప్పగించిన్నట్టు ఆయన పేర్కొన్నారు. ఆయనతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## 14న అంబేద్కర్ జయంతిని విజయవంతం చేయండి

నవతెలంగాణ-బెజ్జూర్



ఈనెల 14న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని అంబేద్కర్ సంఘం నాయకులు కొడుక శ్రీనివాస్, డోంగ్రి సునీల్ కోరారు. ఆదివారం బెజ్జూరు మండల కేంద్రంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. సిర్పూర్ నియోజకవర్గంలోని కాగజ్‌నగర్ పట్టణంలో అంబేద్కర్ జయంతి సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ర్యాలీలో బహుజనుల వాదులుపాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు దుర్గం దేవాజి, సిరిపురం సదాశివ్, కుమ్మరి లింగయ్య, పోచం పాల్గొన్నారు.

## పులి దాడిలో ఆవు మృతి

- బెజ్జూర్ రేంజ్‌లో పులి కదలికలు



నవతెలంగాణ-బెజ్జూర్

పులి దాడిలో ఆవు మృతి చెందిన సంఘటన బెజ్జూర్ రేంజ్‌లో ఆదివారం జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం... బెజ్జూరు మండలం పెద్ద సిద్దాపూర్ గ్రామానికి చెందిన గుర్లె శంకర్ ఆవు శనివారం ఉదయం సిద్దాపూర్ అటవీ ప్రాంతానికి మేతకు వెళ్లింది. ఆ ప్రాంతంలో సంచరిస్తున్న పులి దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు బాధితులు తెలిపారు. సంఘటన స్థలాన్ని చిన్న సిద్దాపూర్ బీట్ అధికారి వెంకటేష్ సందర్శించారు. బెజ్జూర్ రేంజ్‌లోని అటవీ ప్రాంతంలో పులి కదలికలు ఉన్నట్లు తెలిపారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు. ఆర్థిక సహాయం అందించాలని బాధితులు బెజ్జూర్ రేంజ్ అధికారి దయాకర్ ఫిర్యాదు చేశారు.

## ప్రభుత్వ స్థలం కబ్జా

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ముందున్న ప్రభుత్వ స్థలాన్ని కొందరు వ్యక్తులు కబ్జా చేసి పెన్సింగ్ వేశారు. పెన్సింగ్ వేస్తున్న సమయంలో పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ గ్రామ పంచాయతీ స్థలంలో వేసిన పెన్సింగ్‌ను తీయాలని చెప్పినప్పటికీ వారు కంచె వేసి విధులకు ఆటంకం కలిగిస్తున్నారు. కబ్జాదారుల నుండి ప్రభుత్వ స్థలాన్ని ఖాళీ చేయించేలా చర్యలు తీసుకోవాలని పెంచికల్‌పేట్ ఎస్‌ఐయిఱ, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారికి, తహసీల్దార్‌కు సమాచారం అందించినట్టు ఆయన తెలిపారు.



# అప్రోచ్ రహదారి లేక అవస్థలు

- గుండి ప్రధాన రోడ్డు గుంతలమయం
- రోడ్డుపై ట్రాన్స్‌ఫార్మర్‌తో ఇబ్బందులు





అప్రోచ్ రహదారి లేక గుండి రోడ్డు గుండా వెళ్తున్న బస్సు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆసిఫాబాద్ జిల్లాగా ఆవిర్భవించినప్పటికీ ప్రజల ఇబ్బందులు మాత్రం తీరడం లేదు. నేషనల్ హైవే నిర్మాణంలో భాగంగా ఆసిఫాబాద్ పరిసర ప్రాంతం నుండి బైపాస్ వేశారు. మంచిర్యాల వైపు నుండి వచ్చే వాహనాలు హైవే నుండి జిల్లా కేంద్రంలోనికి రావడానికి జిల్లా కేంద్రంలోని వాహనాలు హైవే పైకి వెళ్లడానికి పాత రహదారిని ఉపయోగించారు. అయితే హైవేపై వెళ్తున్న వాహనాల వేగం ఎక్కువగా ఉండడంతో పలుసార్లు జిల్లా కేంద్రంలోనికి వచ్చే రహదారిపై ప్రమాదాలు జరగడంతో అధికారులు జిల్లా కేంద్రం నుండి హైవేపైకి వెళ్లడానికి ఉన్న రహదారి మూసివేశారు. గుండి రహదారి ద్వారా బైపాస్ ఉపయోగించి హైవే పైకి వెళ్లడానికి వాహనాలకు అనుమతిచ్చారు. ఇప్పుడు ఇదే జిల్లా కేంద్రంలోని గుండి రహదారిపై నివాసం ఉంటున్న వారికి శాపంగా మారింది.

**అప్రోచ్ రహదారి లేక ఇబ్బందులు**

జిల్లా కేంద్రం నుండి గుండి రహదారి ద్వారా బైపాస్ నుండి హైవే పైకి వెళ్లడానికి అధికారులు



నిర్ణయం తీసుకున్నారు. అయితే స్థానిక ప్రధాన రహదారి నుండి బైపాస్ వరకు అప్రోచ్ రహదారి నిర్మించలేదు. దీనితో భారీ వాహనాలు రహదారిపై వెళ్తుండడంతో ఆ ప్రాంతంలో నివసించే వారు దుమ్ముతో ఇబ్బంది పడాల్సివస్తోంది. ఇదే ప్రాంతంలో పాఠశాల ఉండడంతో విద్యార్థులకు ఎప్పుడు ఏం జరుగుతుందో అని భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇంత జరుగుతున్న అధికారులు అప్రోచ్ రహదారి నిర్మాణంపై దృష్టి సారించకపోవడం బాధాకరం.

**గుండి రహదారి గుంతల మాయం**

జిల్లా కేంద్రం నుండి బైపాస్ వరకు వెళ్లే రహదారి గుంతల మయంగా మారి వాహన చోదకులకు తలనొప్పిగా తయారైంది. ఇదే రహదారిపై నుండి వాహనాలను మరల్చి నాలుగు నెలలు గడుస్తున్నప్పటికీ కనీసం దానిమీద తట్టెడు మట్టి కూడా పోయలేదంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

**రోడ్డుపై ట్రాన్స్‌ఫార్మర్‌తో కొత్త ఇబ్బందులు**

గుండి రహదారికి వెళ్లే మూలమలుపు వద్ద ట్రాన్స్‌ఫార్మర్ ఉండడంతో రోడ్డు చిన్నగా మారింది. దీంతో ప్రధాన రహదారి నుండి అటువైపు బస్సులు, లారీలు ఇతర పెద్ద వాహనాలు తిప్పడం కూడా కష్టంగా మారిందని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు కనీసం ఆ దిశగా కూడా చర్యలు తీసుకోకపోవడంతో పట్టణ ప్రజల కష్టాలు మరింత పెరిగాయి.

**రహదారి లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం**

**వెంకట్ గౌడ్, స్థానికుడు.**

బైపాస్ రహదారి నుండి జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారి కలిపే వరకు గుండి రహదారి సరిగ్గా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. పిల్లలు ఇంట్లో నుండి బయటకు రావడం కూడా భయంగా తయారైంది. ఈ రహదారి నుండి పెద్ద వాహనాలు రాకుండా చూడాలని గతంలో కలెక్టర్‌కు విన్నవించగా ఆదేశాలు జారీ చేస్తానని హామీ ఇచ్చినప్పటికీ నేటికి నెరవేరలేదు. భారీ వాహనాలు ఈ రహదారిపై రాకుండా చూడాలి.

## నియోజకవర్గ మైనార్టీ సెల్ ఇన్‌చార్జిగా అబ్దుల్ రజాక్ నియామకం

నవతెలంగాణ-కెరమెరి



పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కుమురం భీం ఆసిఫాబాద్ నియోజకవర్గ మైనార్టీ సెల్ ఇన్‌చార్జిగా మండల కేంద్రానికి చెందిన అబ్దుల్ రాజాక్‌ను నియమిస్తున్నట్లు మైనార్టీ సెల్ రాష్ట్ర వైస్ చైర్మన్ ఫరాన్ హాజ్మీ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. తనపై నమ్మకంతో అధిష్టానం బాధ్యతలు అప్పగించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. నమ్మకాన్ని వమ్ము చేయకుండా కాంగ్రెస్ పట్ల అంకితభావంతో పని చేస్తనన్నారు. ఈ సందర్భంగా రజాక్‌ను ఇన్‌చార్జిగా నియమించడంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ మిఠాయిలు తినిపించి అభినందించారు. ఈ కార్యక్రమంలో వ్యాపారి గిత్తే గణేష్, సెండే నారాయణ్, నాగు పటేల్ పాల్గొన్నారు.

## వేతనాలు చెల్లించాలని అంబేద్కర్ విగ్రహానికి వినతి

నవతెలంగాణ-దహెగాం

పెండింగులో ఉన్న వేతనాలను చెల్లించాలని మిషన్ భగీరథ కార్మికులు ఆదివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రాన్ని అందజేసి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలిచాలని వేతనాలతో ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ తాగునీరు అందిస్తున్నామన్నారు. అయినప్పటికీ ప్రభుత్వం నాలుగు నెలల నుండి వేతనాలు చెల్లించకపోవడంతో అప్పులు పుట్టక కుటుంబాలను పోషించుకోలేక పోతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. వెంటనే వేతనాలు చెల్లించాలని లేని పక్షంలో విధులు బహిష్కరిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్మికులు సురేష్, నాగరాజు, తిరుపతి, లవీన్, కృష్ణ పాల్గొన్నారు.



# తూతూ మంత్రంగా పనులు

- మూడు నెలలుగా నత్తనడకన మరమ్మత్తులు

నవతెలంగాణ-సిర్పూర్(టి)

నియోజకవర్గమైన సిర్పూర్(టి)లో రహదారుల పరిస్థితి అధ్వానంగా ఉంది. మండల కేంద్రంతో పాటు గ్రామాలకు వెళ్లే రహదారులు మరి దారుణంగా ఉన్నాయి. మూడు నెలల క్రితం బస్టాండ్ నుండి రైల్వే స్టేషన్‌కు వెళ్లే రోడ్డు మార్గంలో జెడ్పీఎస్ఎస్ పాఠశాలను నుండి ఈడెన్ గార్డెన్ పాఠశాల వరకు సుమారు 100 మీటర్ల రోడ్డును మరమ్మతు పనులను ఆర్అండ్‌బీ అధికారులు ప్రారంభించారు. రోడ్డును తవ్విని అలానే వదిలేశారు. ఈ విషయమై ఇటీవల 'నవతెలంగాణ' తవ్వరు..వదిలేశారు.. అనే కథనాన్ని ప్రచురించింది. అఘామేఘాలపై అధికారులు, కాంట్రాక్టర్ పనులను చేపట్టారు. మూడు రోజుల క్రితం తవ్విన రోడ్డుపై కంకర వేసి అసంపూర్తిగా పనులను వదిలేశారు. ఈ మార్గం గుండా రైల్వే స్టేషన్ వరకు ప్రయాణికులు ఆటో, ద్విచక్ర వాహనాలపై వెళ్తుంటారు అదే విధంగా ఈ మార్గం గుండానే మహారాష్ట్ర, రాజస్థాన్, గుజరాత్, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాలకు నిత్యావసర వస్తువులతో భారీ వాహనాలు పోతుంటాయి. రోడ్డు మరమత్తు పనులు అసంపూర్తిగా ఉండడంతో ఈ మార్గానికి ఇరువైపులా పాఠశాలల విద్యార్థులు, సాధారణ జనం ఇబ్బందులు పడుతున్నారు. నియోజకవర్గ కేంద్రం అయిన సిర్పూర్ పరిస్థితి ఇంత అధ్వానంగా ఉంటే మారుమూల పల్లెల పరిస్థితి ఏ విధంగాఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఈ మార్గం గుండానే అధికారులు, ప్రజాప్రతినిధులు రాకపోకలు సాగిస్తుంటారు. కానీ వారు కూడా పట్టిపట్టనున్నట్టు వ్యవహరిస్తున్నారే ఆరోపణలున్నారు. అదే విధంగా మండల కేంద్రంతో పాటు మారుమూల గ్రామాలకు కూడా రోడ్డు సౌకర్యాలు సక్రమంగా లేవు. నియోజకవర్గం నుంచి కాగజ్‌నగర్ వరకు రోడ్డు పరిస్థితి అధ్వానంగా ఉంది. ఇప్పటికైన అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ విషయంలో చొరవ చూపి అసంపూర్తిగా ఉన్న పనులతో పాటు నూతన రోడ్లను వేయాలని మండల వాసులు కోరుతున్నారు.



కంకర వేసిన వదిలి వేసిన రోడ్డు

# 'చల్ల'గా తాగేస్తున్నారు

- జిల్లాలో విచ్చలవిడిగా వినియోగం
- అనారోగ్యం బారిన పడుతున్న ప్రజలు
- ప్రమాదకరంగా మారుతున్న ఐస్



మండల కేంద్రంలో వెలసిన జూస్ షాప్



థర్మకోల్ బాక్స్‌లో పెట్టిన ఐస్

నవతెలంగాణ-కెరమెరి

ఎండలు మండిపోతున్నాయి. మార్చి రెండోవారం నుంచే సూర్యుడు తన ప్రతాపాన్ని చూపిస్తుండడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. జిల్లాలో అసిఫాబాద్, కాగజ్‌నగర్, పట్టణాలతో పాటు వివిధ మండల కేంద్రాలకు పనుల నిమిత్తం మారుమూల గ్రామాల ప్రజలు అధికంగా వస్తుంటారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులను కలిసేందుకు రాకపోకలు సాగిస్తుంటారు. బయటకు వస్తే ఏదో ఒక చల్లని శీతల పానీయం తాగాలని అనిపించడం సర్వసాధారణం. రోడ్డుపై కనిపించే చెరుకు రసాలు, పండ్ల రసాలు, కూల్‌డ్రింక్స్‌లను తాగుతున్నారు. అవి శరానికి ఆరోగ్యం ఇస్తుందా.. మరింత క్షీణింపజేస్తుందా అనే విషయాన్ని కూడా గమనించడం లేదు. ఇప్పటికే మండలంలో పలు జ్యూస్ సెంటర్లు వేలిశాయి. ప్రజలు చల్లగా ఉన్నాయని వాటిని సేవిస్తే అనారోగ్యాలు వస్తుంటాయి.

**ఐస్ ముక్కలతో పరేషాన్**

చెరుకు రసాలు, జ్యూస్‌లో ఐస్ ముక్కలు వేసి తయారు చేసి ఇస్తుంటారు. మండుటెండల్లో దాహానికి తాళలేక ప్రజలు సైతం ఆ శీతల పానీయాల సెంటర్లను ఆశ్రయిస్తుంటారు. ఐస్‌ను పండ్లజ్యూస్‌లు, చెరుకు రసాలలో తప్పనిసరిగా వేస్తారు. మండే ఎండల్లో ఈ జ్యూస్‌లు తాగితే చాలా వరకు ఉపశమనం కలుగుతుంది. అదే సమయంలో ఆరోగ్యానికి ప్రమాదకరంగాను మారుతుందని వైద్య నిపుణులు అంటున్నారు.

**కొబ్బరి నీరు తాగడమే మేలు**

**డాక్టర్ క్రాంతికిరణ్, పీహెచ్‌సీ వైద్యులు కెరమెరి**



ఎండ వేడిమికి ఉపశమనం కోసం కొబ్బరినీరు తాగడమే మేలు. ఐస్ ఉన్న పండ్ల రసాలు తీసుకోవడం వల్ల అనారోగ్య సమస్యలు వస్తాయి. ఒకవేళ తీసుకుంటే ఐస్ లేకుండా తీసుకోవాలి. వీటివల్ల అతిసారం, పేగు సంబంధిత, గొంతునొప్పి వంటివ్యాధులు వస్తాయి. జాగ్రత్తగా ఉండాలి.

# శాంతి భద్రతల పరిరక్షణ కోసమే కవాతు

నవతెలంగాణ-కెరమెరి

శాంతి భద్రతల సంరక్షణ కోసమే కవాతు నిర్వహిస్తున్నామని డీఎస్పీ సదయ్య అన్నారు. ఎస్పీ సురేశ్ కుమార్ ఆదేశాల మేరకు రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర బలగాలతో కలిసి ఆదివారం మండలంలోని మోడీ, ఝరి గ్రామాల్లోని ప్రధాన రహదారులతో పాటు వీధుల గుండా కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ సదయ్య మాట్లాడుతూ ప్రజలు తమ ఓటు హక్కును ఎలాంటి భయభ్రాంతులకు గురి కాకుండా నిర్భయంగా వినియోగించుకోవాలని సూచించారు. చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల కోడ్ నిబంధనల గురించి అవగాహన కల్పించారు. అనుమానిత వ్యక్తులు కనబడితే సమాచారం అందించాలన్నారు. యువత వ్యవసనాలకు దూరంగా ఉండాలన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ, గ్రామాల్లో ప్రశాంత వాతావరణం కల్పించడం, నేరాలు నిర్మూలించేందుకే ఈ కవాతు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీ డీవై ఎస్పీ రాకేష్, వాంకిడి సీఐ శ్రీనివాస్, ఎస్సై గుంపుల విజయ్ కుమార్ పాల్గొన్నారు.

కౌటాల : ఎన్నికల నేపథ్యంలో ఓటర్లకు భరోసా కల్పిస్తూ పోలీసులు కవాతు నిర్వహించారు. ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరు నిర్భయంగా ఓటును వినియోగించుకోవాలని సీఐ సాదిక్‌పాషా అన్నారు. ఆదివారం మండలంలో తైబజార్ నుండి యాపలగూడ వరకు సీఆర్‌పీఎస్ బృందాలతో కవాతు నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏండ్లు నిండిన యువతీ, యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. శాంతియుత వాతావరణంలో ఓటును వినియోగించుకొనేందుకు పోలీసు ఆధ్వర్యంలో భద్రత చర్యలు తీసుకుంటున నట్లు పేర్కొన్నారు. ప్రజల్లో భయం పోగొట్టాలనే ఉద్దేశ్యంతో గ్రామాల్లో కవాతు నిర్వాహించామని తెలిపారు. డబ్బులు పంచడం, సంఘ సమావేశాలు నిర్వహించి ప్రలోభాలకు గురిచేయడం వంటి సంఘటనలు చోటుచేసుకుంటే నేరుగా పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సమాచారం అందిన 10 నిమిషాల్లో సంఘటన స్థలానికి చేరుకొని చర్యలు తీసుకుంటామన్నారు. అల్లర్లు సృష్టించిన వారిపై కేసులు నమోదుచేస్తామని హెచ్చరించారు. మండల కేంద్రంలోని ప్రధాన రహదారి గుండా కవాతు నిర్వహించారు. ప్రధాన రహదారి గుండా తలోడి, యాపలగూడ, కోయగూడ గ్రామాల్లో కవాతు చేపట్టారు. ఇందులో ఎస్ఐ మధూకర్ పాల్గొన్నారు.



కెరమెరి



కౌటాల

## వేసవికాలం ఉపాధినిస్తున్న ఇప్పపువ్వు సేకరణ

నవతెలంగాణ-బెజ్జూరు



అటవి పరిసర గిరిజన గ్రామాలకు ఇప్పపువ్వు సేకరణ ఉపాధిని అందిస్తుంది. వేసవి కాలంలో ఎలాంటి పనులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్న తరుణంలో ప్రకృతి అందించే అటవి ఉత్పత్తులైన ఇప్పపువ్వు సేకరణ గిరిజన ప్రజలకు కొంత ఊరట కలిగిస్తుంది. ఉదయం అటవి ప్రాంతాలకు వెళ్లి ఇప్పపువ్వును సేకరించి దానిని ఎండబెట్టి గిరిజనులు అమ్ముతారు. అయితే అటవి ఉత్పత్తులైన ఇప్పపువ్వుకు సరైన ధర లేకపోవడంతో గిరిజనులు నష్టపోతున్నారు. అటవి ఉత్పత్తులను సేకరించేందుకు ప్రభుత్వం జీసీసీ ద్వారా ఇప్పపువ్వు, తెల్లబంక, కారంగా తదితర ఉత్పత్తులను సేకరిస్తున్నప్పటికీ ఆశించిన ధరను పెట్టకపోవడంతో గిరిజనులకు ఆదాయం లభించడంలేదు. ఉదయం అటవి ప్రాంతాలకు వెళ్లి సాయంత్రం వరకు కేవలం మూడు, నాలుగు కిలోలు మాత్రమే ఇప్పపువ్వు సేకరిస్తున్నామని, ప్రకృతి అందించే ఇప్పపువ్వుకు ప్రభుత్వం కిలోకు కనీసం రూ.200 నుండి రూ.300 ధర అందిస్తే మరికొంతమంది ఇప్పపువ్వు సేకరణతో ఉపాధి లభించే అవకాశముందని గిరిజనులు అంటున్నారు. అంతేకాకుండా అటవి ప్రాంతాల్లో ఇప్ప, కారంగా, తెల్లబంక, మొర్రి తదితర చెట్లను పెంచాలని కోరుతున్నారు. ఇప్పపువ్వు ఆయుర్వేద ఔషధాల్లో ఉపయోగిస్తారని, దీనిని సేకరించే వారిని ప్రోత్సహించాలని గిరిజన ప్రజలు కోరుతున్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-వాంకిడి

మండలంలో 33 కేవీ విద్యుత్ మరమ్మత్తుల కారణంగా సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏడీఈ శ్రీనివాస్, ఏఈ శ్రీకాంత్ తెలిపారు. వాంకిడి సబ్‌స్టేషన్ నుండి సరఫరా అయ్యే మండలంతో పాటు అన్ని గ్రామాల్లో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని వారు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

# నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

## మంచిర్యాల

సోమవారం | ఏప్రిల్ 08, 2024 | www.navatelangana.com


## శాంతిభద్రతల పరిరక్షణకే కార్డెన్ సర్చ్

నవతెలంగాణ-నస్పూర్



శాంతి భద్రతల పరిరక్షణకే కార్డెన్‌సర్చ్ నిర్వహించినట్లు శ్రీరాంపూర్ ఎస్సై సంతోష్ తెలిపారు. ఆదివారం శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కృష్ణ కాలనీలో కార్డెన్ సర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ ఎలక్షన్ సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అలాగే ప్రతి ఒక్కరూ ఓటు హక్కును స్వేచ్ఛగా సద్వినియోగ పరుచుకోవాలని, కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## అనాధలైన చిన్నారులకు ఆర్థిక సాయం

నవతెలంగాణ-మందమర్రి



అనాధలైన చిన్నారులకు మందమర్రి మిత్ర బృందం సభ్యులు రూ. 15వేలు ఆర్థిక సాయం అందజేశారు. రెండో జోన్‌లో నివాసం ఉంటున్న శ్యామ్ భూమిక దంపతులు ఇటీవల మరణించగా వారి ఇద్దరు చిన్నారులు అనాధలయ్యారు. ఈ ఘటన అందరినీ దిగ్భ్రాంతికి గురిచేసింది. స్పందించిన మందమర్రి మిత్ర బృందం సభ్యులు ఆదివారం బాధిత కుటుంబానికి రూ.15 వేల ఆర్థిక సాయం అందించారు. పిల్లలకు అన్నీ రకాలుగా చేదోడు వాదోడుగా వెన్నంటి ఉంటామని భరోసా కల్పించారు.

## హ్యాండ్ బాల్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక




నవతెలంగాణ-నస్పూర్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఆదివారం ఫంక్షన్ హాల్‌లో పెంచాలా శ్రీధర్ అధ్యక్షతన ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికలలో ఉమ్మడి అదిలాబాద్ జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడుగా పెంచాల శ్రీధర్, కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి వెంకటేష్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల పరిశీలకులుగా రాష్ట్ర హ్యాండ్బాల్ అసోసియేషన్ బి.విష్ణు వర్ధన్, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ మారయ్య, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి, కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి రాంచందర్, కార్యవర్గ సభ్యులు గడ్డం సాయి కుమార్, శీలం సాయి కుమార్, రాంపురం నరేష్, ప్రేమసాయి, కౌశిక్ రావు, రేవెల్లి మహేష్, సంధ్య, జిల్లా హ్యాండ్ బాల్ క్రీడాకారులు పాల్గొన్నారు. అలాగే నూతనంగా ఎన్నికైన వారిని వారు అభినందించారు.

## నంది అవార్డు గ్రహీత బుచ్చమ్మకు సన్మానం



నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని ముత్యంపల్లిలో నంది ప్రతిభా పురస్కార గ్రహీత వేల్పుల బుచ్చమ్మకు ముత్యంపల్లి గ్రామ కాంగ్రెస్ నాయకులు శాలువాలతో ఘనంగా సన్మానం చేశారు. ఇటవల వేల్పుల బుచ్చమ్మకు శిఖర ఆర్ట్స్ సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాద్ రవీంద్రభారతిలో నంది అవార్డు పురస్కారం అందించగా ఈ మేరకు బుచ్చమ్మను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ముత్యంపల్లి పాఠశాలలో వంట నిర్వాహకురాలుగా పని చేస్తున్న బుచ్చమ్మ విద్యార్థులకు మంచి సేవలు అందిస్తున్న సంధర్భంగా సామాజిక నిస్వార్థ సేవా రంగంలో నంది ప్రతిభా పురస్కారం వరించగా అభినందించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల నాయకులు మంద వెంకటేశ్, గ్రామ యూత్ వైస్ ప్రెసిడెంట్ సాయి కుమార్, ప్రధాన కార్యదర్శి పంబాల అరవింద్ పలువురు పాల్గొన్నారు.

## సోమగూడెం ట్యాంక్ బస్తీలో అన్నదానం



నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని సోమగూడెం ట్యాంక్ బస్తీలోని సేవలాల్ మందిరంలో హనుమాన్ మాల ధరించిన భక్తులకు, గ్రామ ప్రజలకు సేవలాల్ భక్తుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సంధర్భంగా కుల పెద్దలు నాయక్ అజ్మీర శ్రీనివాస్, భుక్య ప్రవీణ్ నాయకులు మాట్లాడుతూ బంజార కుల దైవం సేవాలాల్ చూపిన మార్గంలో నడవాలని, మద్యం, మాంసం తీసుకోవడం ఆరోగ్యానికి మంచిది కాదని, చెడు అలవాట్లకు దూరంగా ఉండి సేవా మార్గంలో నడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సపాట్ అశోక్, విజయ్ నాయక్, లవకత్ అంబదాస్, శ్రీనివాస్, హరిచంద్, మోహన్, శ్రీనివాస్, మొగిళి పాల్గొన్నారు.

## కలమడుగు బీజేపీ గ్రామ కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని కలమడుగు బీజేపీ గ్రామ కమిటీని ఆదివారం మండల అధ్యక్షుడు గుండవరపు మధుసూదన్ రావు ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గడ్డి విష్ణు, ప్రధాన కార్యదర్శిగా కోడూరి గంగాధర్, ఉపాధ్యక్షులుగా తిరుమల సురేష్, ఎన్యూసి బుచ్చన్న, కోశాధికారిగా ఎల్కుషి రవి, కార్యదర్శిగా చల్ల తిరుపతి, జంగం మల్లేష్, కార్యవర్గ సభ్యులుగా సుదర్శన్, నాగమల్లులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు బొంతల మల్లేష్ పాల్గొన్నారు.

# జోరుగా సిలువగుట్టపై మొరం తవ్వకాలు

- ప్రభుత్వ స్థలాలు, గుట్టలు వదలని అక్రమార్కులు
- అర్ధరాత్రి సాగుతున్న అక్రమ దందా
- పట్టించుకోని సంబంధిత అధికారులు




జేసీబీతో మొరం తవ్వుతున్న దృష్యం..

నవతెలంగాణ-లక్షెట్టిపేట

అక్రమ మొరం దందా లక్షెట్టిపేట పట్టణంలో మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతుంది. కొందరు అక్రమార్కులు సహజ సంపదను కొల్లగొట్టి ఆదాయ వనరుగా మార్చుకుంటున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండానే తవ్వకాలు చేస్తుండటంతో రూ.లక్షలు ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. స్థిరాస్తి వ్యాపారం జోరుగా సాగుతుండడంతో విచ్చలవిడిగా వెంచర్లు వెలుస్తున్నాయి. వెంచర్లలో రహదారుల నిర్మాణానికి స్థిరాస్తి వ్యాపారులకు మట్టి, మొరం అవసరం ఉండడంతో విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. అక్రమ మొరం నిర్వాహకులు లక్షెట్టిపేట మున్సిపాలిటీలోని సిలువగుట్ట వెనకాల నుండి, ప్రయివేట్ భూముల్లో మొరం, మట్టి రాత్రి వేళల్లో అక్రమంగా తరలిస్తున్నారు. అడ్డు అదుపు లేకుండా యదేచ్ఛగా టాక్టర్‌లు, టిప్పర్‌ల సహాయంతో మొరం



ట్రాక్టర్‌తో మొరం తరళిస్తున్న దృష్యం..

తరలిస్తున్నారు. ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్న అక్రమ దందాను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

**నిబంధనలు బేఖాతరు**

ప్రభుత్వ, ప్రయివేటు భూముల్లో మొరం, మట్టి తవ్వకాలు చేపట్టాలంటే మండల రెవెన్యూ, భూగర్భ గనుల అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. ఈ మేరకు వాల్టా చట్టం ప్రకారం ప్రభుత్వానికి రాయల్టీ చెల్లించి తవ్వకాలు చేపట్టాలి. ఆ నిబంధనలను తుంగలో తొక్కుతూ అక్రమార్కులు గుట్టు చప్పుడు కాకుండా ఈ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

**తహసీల్దార్‌కు స్థానికుల ఫిర్యాదు**

పట్టణంలోని క్రైస్తవ సోదరులు గత ఎన్నో సంవత్సరాలుగా సిలువగుట్ట న ప్రార్థనలు చేస్తూ ఉంటారు. ప్రతి సంవత్సరం ఈస్టర్, గుడ్ ఫ్రై డే, పునరుత్థాన జాతర, తదితర వేడుకలు ఇక్కడే ఘనంగా జరుపుకుంటారు. ఇలాంటి చోట మట్టి మొరం తవ్వకాలకు హద్దు అదుపు లేకుండా పోయింది. గతంలో కూడా ఇక్కడ ఎన్నో సంఘటనలు, గొడవలు జరిగాయి. అయినా పట్టించుకోకపోవడంతో సీఎస్ఐ చర్చి కమిటీ సభ్యుల తరఫున తహసిల్దార్‌కు వినతి పత్రం అందజేశారు.

### అక్రమార్కులపై చర్యలు తప్పవు

**రాఘవేంద్రరావు తహసిల్దార్ లక్షెటిపేట**



మొరం తవ్వకాలు చేపట్టడానికి తప్పనిసరిగా మైనింగ్ శాఖకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. తర్వాత రెవెన్యూ అధికారులు పరిశీలించి నిరభ్యంతర పత్రం ఇస్తే వారికి రాయిలీ తీసుకొని నిబంధనలకు అనుగుణంగా అనుమతులు ఇస్తాం. ఎవరైనా అక్రమ మొరం తరలిస్తే, తరలిస్తున్నట్లు ఫిర్యాదు వచ్చిన చట్ట ప్రకారం చర్యలు తప్పవు. రెవెన్యూ సిబ్బంది కొరత కారణంగా తక్షణం స్పందించలేక పోతున్నాం. ఇప్పటి నుండి స్థానిక పోలీస్‌ల సహకారంతో అక్రమార్కులపై చట్టం ప్రకారం చర్యలు చేపడతాం.



# బీసీల న్యాయమైన హక్కుల కోసం ఉద్యమిస్తాం

- మంచిర్యాలలో ప్రారంభమైన బీసీ చైతన్య యాత్ర




నవతెలంగాణ-నస్పూర్

దేశంలో మెజారిటీ వర్గమైన బీసీల న్యాయమైన హక్కుల విషయంలో రాజకీయ పార్టీలన్నీ తమ వైఖరిని స్పష్టం చేయాలని బీసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం మంచిర్యాల అంబేద్కర్ చౌరస్తాలో ప్రారంభమైన బీసీ చైతన్య యాత్రను ఉద్దేశించి ఆయా సంఘాల నాయకులు ప్రసంగించారు. చైతన్య యాత్రను సీనియర్ బీసీ ఉద్యమ నాయకురాలు పేరం అలేఖ్య జెండా ఊపి ప్రారంభించారు. బీసీ బిడ్డల న్యాయమైన హక్కులను నిలబెట్టే వారినే రాబోయే ఎన్నికల్లో బీసీ వర్గ ప్రజలు గెలిపిస్తారని వారు తెలిపారు. బీసీలు ఎంతో కాలం నుంచి ఎదురు చూస్తున్న బీసీ జనగణనని జాతీయస్థాయిలో చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. ఈ దేశంలో కుక్కలు, కోళ్లు, మేకలకి లెక్కలు ఉంటాయి కానీ, బీసీల లెక్కలు తీయడంలో రాజకీయ నాయకులకు ఇబ్బంది ఏమిటని వారు ప్రశ్నించారు. మెజార్టీ వర్గమైన బీసీల ఓట్లతో గద్దెనెక్కిన పాలకులు అగ్రవర్ణాలకు అనుకూలమైన మనువాద ఎజెండానే అమలు చేస్తున్నారని వారు విమర్శించారు. బీసీ హితం కోరుకునే వారికే దేశాన్ని పాలించే హక్కు ఉన్నదని వారు హెచ్చరించారు. బీసీ జనగణనతో పాటు రిజర్వేషన్ల పెంపు చట్ట సభల్లో బీసీ రిజర్వేషన్లతో పాటు. అగ్రవర్ణ రిజర్వేషన్లను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. మెజార్టీ వర్గమైన బీసీ ప్రజల్లో చైతన్యం వస్తేనే దేశాభివృద్ధి సాధ్యమని వారు తెలిపారు. మహాత్మ పూలే అందించిన బహుజన చైతన్యాన్ని బీసీ ప్రజలు నేడు స్వీకరించాలని వారు కోరారు. మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా జరుగనున్న బీసీ చైతన్య యాత్రలో ప్రజలని చైతన్య పరుస్తామని వారు తెలిపారు. బీసీలకు టిక్కెట్ల కేటాయింపు విషయంలో ఆయా రాజకీయ పార్టీల కపట వైఖరిని ప్రజలు గుర్తిస్తున్నారని వారు హెచ్చరించారు. ఐక్య ఉద్యమం ద్వారానే సమస్యల పరిష్కారం సాధ్యమని, బీసీ ఐక్యవేదిక అందుకు పాటు పడుతుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ వడ్డేపల్లి మనోహర్, సీనియర్ బీసీ నాయకులు కనుకుంట్ల మల్లయ్య, సామాజిక న్యాయ వేదిక కన్వీనర్ రంగు రాజేశం, అఖిల గాండ్ల తెలికుల సంఘం జిల్లా అధ్యక్షులు బుద్ది చంద్రమౌళి, సింగరేణి ఐక్యవేదిక నాయకులు పెద్దపల్లి కోటిలింగం, పెరిక సంఘం నాయకులు శంకరయ్య, బీసీ నాయకులు నీరటి రాజన్న, సోమయ్య, దండె భూమయ్య, వేముల మల్లేష్, ఆడపు గణేష్, చిందం వెంకటేష్, నస్పూరి అఖిల్, ఏదులాపురం రాజు, కొట్టె నటేశ్వర్, పద్మశాలి సంఘం నాయకులు చలమల్ల అంజయ్య, కోమటి రాజు, అడిచెర్ల రాజయ్య, ఇప్పలపల్లి దేవయ్య, వెంకటేశ్వర గౌడ్, కాన్పూర్ సర్పంచ్ ఆయుడప్పు శ్రీనివాస్ పాల్గొన్నారు.



# తిమ్మాపూర్‌లో ఘరానా మోసం


- వృద్ధులను నమ్మించి రూ.18 వేల ఎత్తుకెళ్లిన దుండగులు



నవతెలంగాణ-జన్నారం

ఇద్దరు కురువృద్ధులను మోసం చేసి వారి వద్ద నుంచి రూ.18 వేలు కాజేసిన సంఘటన మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... తిమ్మాపూర్ గ్రామానికి చెందిన సామల బుచ్చయ్య, రాజవ్వల ఇంటికి గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు నెంబర్ ప్లేటులేని ద్విచక్ర వాహనంపై వచ్చారు. వారి ఇంటి పక్కనే కొత్త ఇల్లు కట్టుకుంటున్న రాజేందర్ రూ.20వేలు ఇమ్మన్నాడని చెప్పి, అతని ఇంటికి ఇటుక వేశామని నమ్మ పలికారు. సమయంలో బుచ్చయ్య ఒకరే ఇంట్లో ఉన్నారు. రాజేందర్ ఎక్కడ ఉన్నాడని బుచ్చయ్య అడుగగా ఆయన బ్యాంకులో ఉన్నాడు. రూ.2 లక్షలు డ్రా చేయడానికి బ్యాంకు వెళ్లాడని నమ్మబలికారు. ఆయన వచ్చిన తర్వాత మీకు రూ.20వేలు ఇస్తానన్నాడని నమ్మబలికారు. సరే మా పక్కింటి వ్యక్తే కదా అని బుచ్చయ్య, డబ్బులు నా వద్ద లేవు మా ముసలామె రాజవ్వ దగ్గర ఉన్నాయని అన్నాడు. ఆమె ప్రస్తుతం తాళ్లపేటకు వెళ్లింది, అనడంతోనే ఆ ఇద్దరు వ్యక్తులు సామల బుచ్చయ్యను, వారి ద్విచక్ర వాహనంపై ఎక్కించుకొని తాళ్లపేటకు వెళ్లి, అక్కడ రాజవ్వ దగ్గర, ఆ గుర్తు తెలియని వ్యక్తులు ఇరువురు ఫోన్‌లో రాజేందర్‌తో మాట్లాడినట్లు మాట్లాడి రాజేందర్‌కు ఫోన్ చేసినట్టే చేసి, ఓకే రాజేందర్ వీళ్లని డబ్బులు ఇమ్మంటావా తీసుకుంటున్నామని అన్నారు. దీంతో ఆ కురువృద్ధులు ఇరువురు. నిజమే రాజేందరూ ఫోన్లో మాట్లాడారు. అనుకొని డబ్బులు ఇంటి వద్ద ఉన్నాయని, బిడ్డ ఇస్తా పదండి అనడంతో, సామల బుచ్చయ్యను అక్కడే వదిలిపెట్టి సామల రాజవ్వను వారి ద్విచక్ర వాహనంపై, ఎక్కించుకొని తిమ్మాపురం రాగానే, ఆమె తన ఇంట్లో ఉన్న రూ.18 వేలు, వారి ఇంటి పక్కన ఉన్న ఇంకో వ్యక్తితో, డబ్బులు లెక్కించి వారి చేతిలో పెట్టగానే, వారు అక్కడ నుంచి ద్విచక్ర వాహనంపై ఉడాయించారు. అప్పుడు సామల రాజవ్వ, పక్కన ఇల్లు కట్టుకుంటున్న రాజేందర్ ఇంటికి పోవడంతో, రాజేందర్ ఇంట్లోనే ఉన్నాడు. అయ్యో బిడ్డ నీ పేరు చెప్పి ఎవరో రూ.20వేలు అడిగారు నేను రూ.18 వేలు ఇచ్చాను అని చెప్పడంతో రాజేందర్ నాకేం తెలుసు, వారెవరో నాకు తెలువది. నువ్వు ఎలా ఇచ్చావు నేను ఇంట్లోనే ఉన్నాను అని అనడంతో మోసపోయానని ఇద్దరు లబోదిబోమని వాపోయారు. స్థానిక సర్పంచ్ జాడి గంగాధర్, జన్నారం పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించడంతో, పోలీసులు, దొంగలను పట్టుకునే, పనిలో ఉన్నారు.

## ఘనంగా సంతు శ్రీ రామారావు మహారాజు విగ్రహ ఆవిష్కరణ



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని పొన్కల్ గ్రామపంచాయతీ పరిధిలోని జువిగూడలో, ప్రభుత్వ పాఠశాల సమీపంలో ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన, సంతు శ్రీ రామారావు మహారాజ్ విగ్రహావిష్కరణ, కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆదివారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లంబాడాలు, ఉత్సవ కమిటీ సభ్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా జువ్విగూడాలో ఉన్న సంతు సేవాలాల్ ఆలయం నుంచి, థిస్ నార్లు తలపై ఎత్తుకొని, మహిళలు నృత్యాలు చేస్తూ, నూతన విగ్రహం వరకు భారీ ర్యాలీగా వచ్చారు. రామారావు మహారాజ్ విగ్రహాన్ని, లంబాడా, బంజారల ఆరాధ్య దైవం, సంతు శ్రీ గురు దీక్ష ప్రేమ్‌సింగ్ మహారాజ్ చేతుల మీదుగా, విగ్రహ దాత ఖానాపూర్ బీఆర్ఎస్, నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఆదిలాబాద్ జెడ్పీ చైర్మెన్ రాథోడ్ జనార్దన్ ఆవిష్కరించారు. అనంతరం లంబాడాలు ప్రత్యేక పూజలు చేశారు. సంతు శ్రీ రామారావు మహారాజ్ లంబాడ జాతికి చేసిన సేవలను కొనియాడారు. వారి అడుగుజాడల్లో నడవాలి అన్నారు. కార్యక్రమంలో, ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్లమెంటు అభ్యర్థి ఆత్రం సుగుణ, కాంగ్రెస్ ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాంనాయక్, స్థానిక ఎంపీపీ మాదాడి సరోజన, జెడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ సుతారి వినయ్ కుమార్, స్థానిక తాజా మాజీ సర్పంచ్ జక్కు భూమేష్, సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు జాడి గంగాధర్, తాళ్లపల్లి రాజేశ్వర్, ఫజల్ ఖాన్, మండల అధ్యక్షుడు రాజారాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి సూలువ జనార్దన్, శ్రీరామ్ నాయక్, విగ్రహ ఆవిష్కరణ కమిటీ సభ్యులు, సందేశ్ నాయక్, ప్రకాష్ నాయక్, నందు నాయక్, రాజు నాయక్, రాములు నాయక్, వివిధ గ్రామాలకు చెందిన లంబాడాలు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ సింగరేణి ఉద్యోగి మృతి



నవతెలంగాణ-మందమర్రి

అదుపు తప్పి పడి, గాయాపాలైన సింగరేణి ఉద్యోగి, చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్కే ఓసీలో ఫిట్టర్‌గా పనిచేస్తున్న పాయల వెంకటేశ్వర్లు(53) శనివారం ద్విచక్రవాహనంపై వస్తుండగా రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి రామన్ కాలనీ వద్ద బైక్ అదుపుతప్పి కింద పడ్డాడు. వెంటనే అంబులెన్స్‌లో సింగరేణి ఆస్పత్రికి తరలించి, చికిత్స అందిస్తుండగా శనివారం రాత్రి మృతి చెందనట్టు తెలిపారు. మృతుని భార్య చంద్రకళ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

## మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని ముత్యంపల్లి క్రీడా మైదానంలో బోయిని పెద్ద గొల్ల భీమయ్య యాదవ్ స్మారక మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం ప్రారంభించారు. ముందుగా బోయిని పెద్ద గొల్ల భీమయ్య యాదవ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్లు అర్పించి అనంతరం టోర్నీని యాదవ సంఘం నాయకులు ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సంధర్భంగా టోర్నమెంట్ ప్రారంభించిన అనంతరం వైస్ ఎంపీపీ పూస్కూరి విక్రంరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమణారెడ్డి మాట్లాడుతూ క్రీడాకారుల్లో క్రీడా స్ఫూర్తి ఉండాలని, క్రీడల్లో గెలుపు ఓటమలు సహజమని, నేటి ఓటమి రేపటి గెలుపుకు నాంది పలుకుతుందన్నారు. ఈ టోర్నీలో మండలంలోని మొత్తం ఆయా గ్రామ పంచాయతీలోని 12 జట్లు పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ బోయిని తిరుపతి, ఏనుగు తిరుపతిరెడ్డి, దాసరి శంకర్, పెద్ద గొల్ల రాయులు, మారం లచ్చన్న, వేల్పుల రవి, రేశవేణి మల్లయ్య, పంబాల భీరయ్య, పంబాల చంద్రయ్య, వేల్పుల పోశం, వేల్పుల బలరాం, పాలగాని రాములయ్య, పోలవేణి పోశం, పుట్ట శ్రీనివాస్, బోయిని రాజన్న, రామన్న గుమ్ముల అశోక్, సాయి పాల్గొన్నారు.

## ఘనంగా పోచమ్మ బోనాలు

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని పెద్దనపల్లి గ్రామ పంచాయతీలోని సోమగూడెం న్యూకాలనీలో పోచమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. ఈ సంధర్భంగా న్యూ కాలనీ గ్రామస్తులు మొక్కులు చెల్లించి ప్రత్యేక పూజలు చేశారు.